# గుండె గుండెకో దీపం



— శ్రీ మధుర్‌జీ

పదకొండు గంటలవేళ.

వీధి నిశ్శబ్దంగా వుంది. నిర్మానుష్యంగామా వుంది. చెట్టుచేమా వున్నవాళ్లు తమ పొలం పనులకూ—అది లేనివాళ్లు యితరుల పొలం పనులకూ, బడికెళ్లే వయస్సున్న పిల్లలు బళ్లకూ, వయసుండీ స్థోమతలేని పిల్లలు పశువులు మేపటానికీ వెళ్లి — అప్పటికే చాలా సేపయ్యింది.

అందుకే ఆ వీధి మళ్లీ సాయంకాలందాకా సందడికోసం ఎదురుచూస్తూ నిశ్శబ్దంగా నిరీక్షిస్తోంటుంది.

ఆ వేళ—

పదకొండు గంటలకే ఆకాశంలో సూర్యుడు మిడిసిపడుతున్నాడు—యవ్వనంలోకి అడుగుపెట్టి క్రిందుమీదెరగని గడుసుదానిలా.

'నేనేం తక్కువా' అన్నట్లు గాలి బిగదీసు క్కూర్చుంది—అత్తగారి మీద అకారణంగా అలిగిన కొత్త కోడలిలా.

ఆ వీధి చివర పాత పెంకుటిల్లు.

పడిపోవటానికి ఎదురు చూస్తున్నట్లున్న ఆ పాత పెంకుటింటి ముందటి అరుగుమీద రాలిపోవటానికి సిద్ధమవుతున్న పండు వయసు వృద్ధ స్త్రీమూర్తి.

ఆమె ముఖం —

ఆ యింటి ముందటి ఆకులు రాల్చిన వేపచెట్టులా కళావిహీనంగా వుంది.

ఆమె దేహం —

పెచ్చులూడిన పెంకుటింటి గోడలా వికృతంగా ముడతలుపడి వుంది.

ఆమె కళ్లు —

పెరట్లో యెప్పుడో ఎండిపోయిన బావిలా — శూన్యంగా, దీనంగా వున్నాయి.

ఆమె చూపులు —

మండే ఎండల్లో తొలకరి జల్లుకోసం ఎదురుతెన్నులు చూస్తున్న భూదేవి చూపుల్లా వున్నాయి.

ఆమె అనసూయమ్మ !!

అరవై ఏళ్లు నిండిన అనసూయమ్మ వంచిన తల ఎత్తకుండా ఓపిగ్గా విస్తర్లు కుడుతోంది. పూర్తయిన విస్తర్లు ఒకవంక వరుసలో—బుద్ధిమంతులయిన కుర్రాళ్లలా పొందికగా వున్నాయి. కుట్టవలసిన మోదుగాకులు కట్టలు కట్టలుగా అస్తవ్యస్తంగా వున్నాయి.

అలసిన చూపులు — అలవాటయిన వ్రేళ్లు యాంత్రికంగా కదులుతున్నాయి. ఆ చూపులకు, ఆ వ్రేళ్లకు ఆ పనిలో మూడు దశాబ్దాల అనుభవం వుంది మరి !

అరగంట క్రిందటనుంచి — ఆమె మధ్య మధ్య తల యెత్తి, అరచేయి నొసటికి అడ్డం పెట్టి — వీధివైపు దృష్టి సారిస్తునే వుంది. నిరాశ నిండిన ఆ చూపులు మళ్లీ పనిలో అయిష్టంగా మునుగుతున్నాయి.

ఎండవేడికి కాకి వేపచెట్టు మీద కూర్చుని అసహ్యంగా అరుస్తోంది.

అరిచే ఆ కాకిని — పదే పదే వీధివైపు చూస్తున్న తన యజమానురాలిని మార్చి మార్చి చూస్తోంది కుంటి కుక్క

కాలం నిశ్శబ్దంగా, నెమ్మదిగా కదులుతోంది.

కాకి అకస్మాత్తుగా అరవటం ఆపి — ఎటో నిశ్శబ్దంగా యెగిరిపోయింది. కుంటికుక్క, ఏదో వాసనపట్టి పరుగులమీద వీధి మలుపు దాకా వెళ్లి —ఆనందంగా భౌభౌ మని తోకాడిస్తూ—రివ్వున ముసలమ్మ దగ్గరకొచ్చి కాళ్లదగ్గర కూర్చుంది—నాలుక బైటపెట్టి సరదాగా తోకాడిస్తూ.

ఆ కుక్క ముసలమ్మకేం చెప్పిందో ఏమో కాని– ఆమె చేస్తున్న పనాపి— కళ్లనిండా మెరిసే ఆశతో, చిరునవ్వుతో వీధి వైపు చూసింది.

సరిగ్గా అప్పుడే వీధి మలుపు తిరిగాడు పోస్టుమన్ చలమయ్య.

నలభై ఏళ్ళు నిండిన చలమయ్యకు తరగని కలిమి చెరగని ఆతని చిరునవ్వు.

పోస్టుమాన్‌గా ఇరవై ఏళ్లనుండి పని చేస్తున్న చలమయ్య — వందలు వేలు వెనకెయ్యక పోయినా — ఎందరి ఆప్యాయతలనో దోచుకుని ధనంగా దాచుకున్నాడు. వూరిల్లే తప్ప — పెంకుటిల్లయినా కట్టుకోలేకపోయినా ఎందరెందరి గుండెల్లోనో అభిమానాల గూడు కట్టుకున్నాడు. లోకంలో ఎక్కడో తప్ప దొరకని మంచి మనసు చలమయ్యకున్న తరగని ఆస్తి. అతనందించేవి వుత్తరాలే అయినా అందుకునేవి ఆత్మీయతలు.

దేనికయినా ఈ లోకం ఖరీదు కట్టగలదేమోకాని ఆత్మతృప్తికీ, ఆత్మీయతకూ, ఆప్యాయతకూ ఖరీదు కట్టలేదు కదా !

కాకీ బట్టల్తో, భుజానికి వ్రేలాడే సంచితో, చేతిలో ఉత్తరాల కట్టతో — తన రాకకోసం

డా॥ వి. వి. కె. రావ్, B.A.

వైద్య విద్వాన్, వైద్యాచార్య, సెక్స్ స్పెషలిస్ట్



వివాహము వాయిదా వేయ నవసరం లేదు. హస్త ప్రయోగం, నరముల బలహీనత, శీఘ్రస్ఖలనములకు ఆయుర్వేద చికిత్స పోస్టుద్వారా చికిత్స కలదు

**రావూస్ క్లినిక్**

టి. బి. రోడ్, తెనాలి

ఫోన్ . 3700 & 4010



**Now Available in 2 MODELS**

Lady Chum

WASHING MACHINE

FIBRE GLASS TANK With 2 YEARS GUARANTEE




Authorised main Dealer

Phone 64024

innovations

CHALLAPALLIBANGALOW SITE VIJAYAWADA 520002



మీకు బేబి/బాబు కావాలా



ఆపరేషన్. ఇతర వైద్య చికిత్సలతో నిరాశ చెందిన సోదరీమణులు అనేకులు మా సలహాలచే సంతానవతులయి ఇచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష సంధ్యాదోష నివారణా నిపుణులు. * ఉచిత వివరములకు :

**శ్రీ నాగార్జున మూలిక కుటీరం,**

రామాలయం వీధి, తెనాలి—2. | 5 వలైను, కేదారేశ్వరపేట, విజయవాడ—3.


# గుండె గుండెకొక దీపం

ఎదురుచూచే కళ్లల్లో విషాదాన్ని, ప్రమోదాన్ని నింపుతూ నడుస్తున్నాడు చలమయ్య.

అనసూయమ్మ గుండెలు ఆతురతతో కొట్టుకుంటున్నాయి. చలమయ్య రాకకోసం యింతవరకు వేగిరపడ్డ మనసు — యిపుడు కలవరపడుతోంది.

తన రాకకోసం కళ్లనిండా వేయి ఆశల్ని నింపుకొని ఎదురుతెన్నులు చూస్తున్న అనసూయమ్మ చూపులవెనుక కదులుతున్న నీలినీడల్ని చూస్తూనే చూడనట్లుగా నడుస్తూ చలమయ్య ఆ పెంకుటిల్లు దాటాడు.

'ఆఁ !!' — అనసూయమ్మ దీర్ఘంగా నిట్టూర్చింది. నిట్టూర్పునిండా దట్టంగా పేరుకున్న దుఃఖం.

'నాయనా చలమయ్యా...' ఎదురైన నిరాశ ఆ ముసలి కంఠాన్ని వణికించింది. ఆ పిలుపుకు అలవాటుపడ్డ చలమయ్య కాళ్లు అప్రయత్నంగా ఆగిపొయ్యాయి. 'యివ్వాళకూడా వుత్తరంముక్క రాలేదా నాయనా... ?!'

రాలేదని ఆ ముసలితల్లికి తెలుసు. వస్తే చలమయ్య ఆప్యాయంగా 'అవ్వా' అని పిలిచి, ఆ వుత్తరంముక్క యిచ్చి — వివరంగా చదివి చెబుతాడని కూడా తెలుసు.

అన్నీ తెలిసినా కనీ పెంచిన ఆ మనసు 'అలా' అడగకుండా వుండలేదని చలమయ్యకు బాగా తెలుసు. చలమయ్య చదువు రానివాళ్లకు ఉత్తరాలు వ్రాసిపెట్టటం — చదివి పెట్టటమే కాదు — ఆ వుత్తరాల వెనుకనున్న మనసును కూడా చక్కగా చదవగలడు.

'రేపు తప్పకుండా వస్తుందిలే అవ్వా...' చలమయ్య చిరునవ్వుతో భరోసా యిచ్చాడు.

ఎండిన ఆ చూపుల్లో లీలగా. మెదిలిన ఆనందరేఖ. ఎదురుచూస్తున్న. ఉత్తరాలు రాలేదని చెప్పటం చలమయ్యకు అలవాటులేదు. అలా చెప్పటం యిష్టపడడు కూడా.

'ఎండనబడి వచ్చావు ... కాసింత సేపిలా అరుగుమీద కూర్చో నాయనా ... అదిగో ఆ కుండలో చల్లని మంచినీళ్లున్నాయి. దాహం తీర్చుకో ... '

నడివేసవిలో చల్లని మంచినీళ్లకన్నా చల్లనయినది ఆ ఆప్యాయత ! చలమయ్య మంచినీళ్లు త్రాగి, ముఖానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు పైపంచెతో. పంచవలసిన వుత్తరాలు యింకా నాలుగయిదు మించిలేవు. స్థిమితంగా అరుగుమీద కూర్చున్నాడు.

ఎండవేళ చల్లని చిరుగాలి పలకరిస్తోంది ఆపదలో ఆదుకునే స్నేహితునిలా.

'నాయనా చలమయ్యా ... ఆ వుత్తరాలిచ్చేసి కాసింత యిలారా నాయనా ... 'వాడికి' మళ్లీ ఓ వుత్తరం ముక్క రాసిపెడుదువుగాని. ఇదిగో పొద్దున్నే ఆ యెదురింటి కుర్రాణ్ణి పంపి కార్డు ముక్క కూడా తెప్పించిపెట్టుకున్నాను.'

'మళ్లీ యెందుకవ్వా రాయటం—మొన్ననేగా రాశాను.'

'మొన్నేమిటి నాయనా ... అప్పుడప్పుడే పదిహేనురోజులు గడిచాయి. ఇవ్వాళ...రేపు.. నురునాడని వొకటే యెదురుచూస్తున్నాను' ఆమె కళ్లు తుడుచుకుంది.

దూరాన పట్నంలోనున్న కొడుకునుండి 'కమ్మని కబురు' మోసుకొచ్చే కార్డుముక్క కోసం — కనిపెంచి — పండుబారిన ఆ ముసలి తల్లి మనసు — ఎంత ఆతురతతో ఎదురుతెన్నులు చూడగలదో చలమయ్య ఊహించగలడు. కానీ దూరాన వున్న ఆ కన్నకొడుకు మనసే చలమయ్య ఊహకందటం లేదు !

'సరేనవ్వా ! అలాగే ... ఈ వుత్తరాలు పంచి ... నీకు కార్డుముక్క వ్రాసిపెడతాను గాని . . '

వెడుతున్న పోస్ట్‌మాన్ వంక కోపంగా చూసి 'గయ్'మంది కుంటికుక్క

'నీకుత్తరం యివ్వలేదని నీ కుక్కకూడా కోపమొచ్చింది కదటవ్వా ?' నవ్వుకుంటూ వీధి మలుపు తిరిగాడు చలమయ్య.

అనసూయమ్మ మనసు — మబ్బులులేని ఆకాశంలా ఖాళీగా అయిపోయింది.

అనసూయమ్మ చూపు — ఎండిన ఎడారిలా నిర్జీవంగా మారిపోయింది.

ఇంకా విస్తర్లు కుట్టాలనిపించలేదు వాటిని దూరంగా జరిపి — కాస్తంత వెనక్కు జరిగి — గోడకి చెరగిలబడింది.

మధ్యాహ్న భోజనాలకు బడిపిల్లలు యిండ్లకొస్తున్నారు — కమ్మ కమ్మగా కబుర్లు చెప్పుకుంటూ — పుస్తకాల సంచులు హుషారుగా ఊపుకుంటూ.

ఆ పిల్లలను అలా ... అలా తదేకంగా చూస్తున్న అనసూయమ్మ మనసు — ముప్పై ఏళ్లు వెనక్కి వెళ్లింది.

అనసూయమ్మ భర్త రమణయ్యకు తెలివితేటలు లేకపోలేదుగాని — అవి ఈ లోకంలో — బ్రతుకు బండిని నల్లేరు మీది నడకలా సజావుగా నడిపించటానికి పనికి వచ్చేవిమటుకు కాదు. చిల్లర కొట్టుతో నాలుగు రాళ్లు సంపాదించేవాడు. అనసూయమ్మ విస్తర్లు కుట్టి ఆ నాలుగు రాళ్లకు మరో రెండు రాళ్లు కలిపేది. చాలీ చాలని సంపాదనలో—నలిగి నలిగి పెరుగుతున్న మరో నలుసు రాముడనబడే రామారావు.

రాముడికి పన్నెండేళ్లు రాకమునుపే—గతుకుల రోడ్డులో అతి కష్టం మీద నడుస్తున్న బ్రతుకు బండి అకస్మాత్తుగా అదుపు తప్పింది.

భార్యనీ, కొడుకునీ ఈ జనారణ్యంలో వదిలి, గుండె పోటుతో బ్రతుకు పీడ వదిలించుకున్నాడు రమణయ్య.

రెండు రెక్కల్లో ఓ రెక్క విరిగింది.

బ్రతుకు బండికి ఓ చక్రం విరిగింది.

జనారణ్యంలో విచ్చలవిడిగా తిరుగుతున్న మానవ క్రూర మృగాలధాటికి భయపడి అనసూయమ్మ కూడా బలవంతంగానైనా 'బ్రతుకుపీడ' వదిలించుకుందామనుకుంది. కానీ—బెదురుతున్న లేడిపిల్ల చూపులతో 'కన్న ప్రేమ' ఆమె ప్రయత్నాన్ని మొదలంటా నరికివేసింది.

చిరిగిన విస్తరిలాటి తమ బ్రతుకుని సరిచేసుకొనటానికి అనసూయమ్మ విస్తర్లు కుట్టటానికే తన బ్రతుకంకితం చేసింది.

శ్రమ ... శ్రమ ... శ్రమ ... రేయింబగళ్ళు శ్రమ.

శరీర శ్రమను అధిగమించ గల్గింది కాని—మానసిక వ్యధకు సుడిగాలిలో బగుడాకులా వణికిపోయింది.

మానవ మృగాల ఆకలి చూపులు......

వయసులో నున్న ఒంటరి ఆడదాని మీద—చురకత్తులుగా దూకుతున్న చూపులు.

ఆ చూపులకు తను బలికాకూడదు.

ఆ క్రూర మృగాల ఆకలికి తను ఆహుతి కాకూడదు.

అందుకై—

అనసూయమ్మ ఏ స్త్రీ చెయ్యని సాహసం చేసింది.

ఉపవాసాలతో తన శరీరాన్ని యెండగట్టింది. సంస్కారం లేకుండా తన దేహ ఛాయను మట్టిపాలు చేసింది. చివరకు — నల్లగా తుమ్మెదల బారులా నిగనిగలాడే తన తలను గొరిగించుకుంది.

ఇప్పటి అనసూయమ్మ ఒకప్పటి అనసూయమ్మకు ఛాయమాత్రంగానైనా కాదు. అప్పుడు మృగాల కళ్ళు చల్లబడ్డాయి—ఎదుట వేడెక్కించే రూపంలేక.

ఇదంతా ఆమె యెందుకు చేసింది? కారణమేమిటి? తన సుఖాన్ని, జీవితాన్ని యెందుకు త్యాగం చేసింది??

సమాధానం స్వల్పం. కొడుకుకోసం! తన కన్న కొడుకుకోసం !!

తల్లి కష్టంతో కొడుకు పెరిగాడు.

తల్లి కన్నీళ్లతో కొడుకు మరీ పెరిగాడు.

ఆ కన్నతల్లి త్యాగాలతో కొడుకు మరీమరీ పెరిగాడు.

వయసులో పెరిగాడు. చదువులో పెరిగాడు. పెళ్లితో పెరిగాడు. ఉద్యోగంతో పెరిగాడు. సంపాదనతో మరీమరీ పెరిగాడు. అంతస్థుతో మరింతగా పెరిగాడు.

కొడుకును 'అలా అలా' పెంచిన ఆ కన్నతల్లికి అందనంత ఎత్తుకు పెరిగాడు...! గుండెల్లో దాచుకుని పెంచిన ఆ కొడుకుని, గుండె చించుకొని తను పిలుస్తున్నా వినపడనంత, వినిపించుకోనంత ఎత్తుకు పెరిగాడు.

శ్రమించి, శ్రమించి అలసిన ఆ శరీరం—యిక శ్రమించలేక— అక్కున చేర్చుకుని యింత విశ్రాంతి నివ్వమని ప్రాధేయపడుతున్నా ఆదరించనంతటి అంతస్థుకు పెరిగాడు ఆ కొడుకు.

మడతలుపడ్డ ఆ చెంపలనిండా కన్నీళ్లుగా మిగిలాయి ఆ జ్ఞాపకాలు. ఆ జ్ఞాపకాలమాటున మునిగిన ఆ మనసు— చలమయ్య రాకను కూడా గుర్తించనేలేదు.

'ఏమవ్వా!... ఏడుస్తున్నావా?'—చలమయ్య గొంతులో బాధ.

'కాదు నాయనా! ఎందుకో మనసు పదే పదే గతంలోకి పోతోంది. అయినా ఈ ముసలి మనసుకు గతం తప్ప భవిష్యత్తేముంటుంది—?!'

అనసూయమ్మ మాటలు ఎన్నెన్నో జీవిత సత్యాలను విప్పి చెప్పినట్లుగా తోచాయి చలమయ్యకు. అనుభవాలతో పండిన మనసూ, వయసూ ఆమెవి!

అనసూయమ్మ కన్నీళ్లు తుడుచుకుంది— చలమయ్యకు కార్డు అందించింది.

'ఒరే రాముడూ! యిప్పటికే నీకు ఎన్నో ఉత్తరాలు వ్రాయించాను. నా శరీరంలో శక్తి పూర్తిగా సన్నగిల్లింది. నాలుగు గింజలు కూడా వుడకేసుకోలేక పోతున్నాను. ఇక్కడ వున్నది నా కట్టె మాత్రమేరా... నా ప్రాణం వున్నది నీదగ్గరేరా నాయనా. నేను నోరు తెరిచి— నీ దగ్గరకు వస్తానురా నాయనా అని అనకముందే— పిలుచుకుపోవటం నీ ధర్మం. నా కంతటి అదృష్టం లేదు. వస్తాను— వస్తానని నే వ్రాయిస్తున్నా సరే నీవు పలకటంలేదు. కళ్లల్లో ప్రాణం పెట్టుకొని రోజూ నీ ఉత్తరం కోసం ఎదురుచూస్తున్నాను. నీ కన్నతల్లి మనసు నీ కంత అర్థం కాలేదా నాయనా. ఆశ చావక, మనసు చంపుకోలేక చలమయ్యతో మళ్లీ నీకీ వుత్తరం వ్రాయిస్తున్నాను. ఇది నిన్ను కని పెంచిన తల్లి చివరి కోరిక — చివరి వుత్తరం కూడా...''

అనసూయమ్మ కళ్లు మూసుకుని— యెదురుగా ఉన్న కొడుకుతో చెపుతున్నట్లుగా తన ధోరణిలో తను చెప్పుకుపోతున్నా — ఆమె మనసును ఎలా అక్షరబద్ధం చేయాలో చక్కగా తెలిసిన చలమయ్య అలానే చేసి ఆ వుత్తరం ముగించి చదివి వినిపించాడు.

విని ఆమె సరిపోయిందన్నట్లుగా తలూపింది.

'మరి నేవస్తానవ్వా...ట్మైమవుతోంది—'

కార్డు తీసుకవెడుతున్న చలమయ్య వెంట వీధి మలుపుదాకా తోకాడించుకుంటూ ఆనందంగా వెళ్లింది కుంటికుక్క.

తప్పదన్నట్లుగా నాలుగు మెతుకులు యెంగిలిపడి మిగిలింది కుక్కకేసింది. కుట్టిన విస్తర్లు తీసి ఓ ప్రక్కగా పెట్టి ఆకులు మూలకుతోసి మంచంవేసి నడుం వాల్చింది అనసూయమ్మ.

శూన్యంగావున్న ఆమె మనసు గతించిన గతంకేసి మళ్లీ పరుగులు తీసింది. ఎక్కడో దూరంగా చర్చిలో రెండు గంటలు మ్రోగాయి.

* * *

మళ్లీ మధ్యాహ్నం ...


చిటపటలాడుతున్న ఎర్రని ఎండ ...

బిగుసుకపోయిన గాలి ...

ఆకులు రాలిన వేపచెట్టు మీద కాకిగోల...

నిశ్శబ్దం రాజ్యమేలుతున్న వీధి ...

పాత పెంకుటింటి అరుగుమీద మోదుగాకులకు విస్తర్లుగా పునర్జన్మ కల్పిస్తున్న అనసూయమ్మ ... ఆమె కాళ్లదగ్గర అరమోడ్పు కన్నులతో కుంటికుక్క ...



తల్లి మనసు కొడుకు కబురుకోసం వేగిర పడుతోంది.

లోకంతీరు తెలిసిన బుద్ధి మనసును అదుపులోపెట్ట ప్రయత్నిస్తోంది.

నిరీక్షణ...నిరీక్షణ...

జీవన సాయం సంధ్యలో — తను నాటి ... నీళ్లుపోసి...కంచెవేసి రక్షించి పెంచి పెద్దచేసిన వృక్షము క్రింద కాస్తంత నీడకై ఆశ...ఆరాటం.

తల్లిగా అది అత్యాశకాదు ... ఆశ కూడా కాదు.

అది ఆమె హక్కు—అది అతని బాధ్యత !!

హక్కులు హరించుకు పోతున్నప్పుడు —

పోరాడి సాధించుకోగల వయసూలేదు—

మనసూరాదు. ఎదుటి వ్యక్తి బాధ్యతలు మరిచిపోతున్నప్పుడు మందలించి గుర్తుచేయగల అధికారమూలేదు—అవకాశమూ రాదు.

కనీస కోర్కెలు కూడా చంపుకొని— రామున్ని రామారావుగా చేసిన ఆ మనసు—కనీస సుఖాల గొంతు నులిమి—మట్టిని మాణిక్యంగా మార్చిన ఆ తనువు—

ఒక పిలుపు కోసం—

కేవలం ఒక తియ్యని పిలుపుకోసం---

'అమ్మా ! నీకు నేనున్నా రా---' అన్న ఒక చిన్న భరోసా కోసం — పలవరించి పోతోంది, రేపవళ్లూ కలవరించిపోతోంది ఆముసలి తల్లి మనసు.

ఆ పలకరింతతో పులకరించిపోవాలని క్షణాలు యుగాలుగా సుదీర్ఘంగా నిరీక్షిస్తోంది.

అనసూయమ్మ ఆలోచనలను చెదరగొడుతూ—కుక్క వీధి మలుపు దగ్గర్నుంచి భౌభౌమంటూ తోకాడించుకుంటూ వచ్చింది.

ఎండమావుల్లాటి ఆ తల్లి కన్నుల్లో నీటి ఊటలాటి ఆనంద రేఖ !

పోస్ట్‌మాన్ చలమయ్య వీధి మలుపు లిరిగాడు. పాత పెంకుటింటి ముందు ఆగాడు. ఆనందంతో అనసూయమ్మ గుండె వేగం పెరిగింది.

'ఏమవ్వా ! భోజనం చేశావా ? అప్పుడే విస్తర్లు ముందేసుక కూర్చున్నావు—' చలమయ్య అరుగు మీద కూర్చున్నాడు.

'ఎక్కడిది నాయనా...నీ కోసమే చూస్తూ కుడుతున్నా—'

చలమయ్యకూ తెలుసు—కొడుకు పిలుపు ఆ ముసలి తల్లికి పంచభక్ష్య పరమాన్నాలకన్నా ఎక్కువని.

'ఇదిగో అవ్వా...నీకు ఎం. వో. వచ్చింది—'

'అయితే...వుత్తరం రాలేదా నాయవా...' ఆమె గొంతులో నిరాశ-

'ఇవ్వాళ డబ్బొచ్చింది కాబట్టి — బహుశా రేపు వుత్తరం రావచ్చు—' నిరాశలో నిదురిస్తున్న ఆశను నిద్రలేపుతున్నాడు చలమయ్య.

## గుండె గుండె కొక దీపం

యం. వో.ఫారం మీద అనసూయమ్మ వేలిముద్రవేసింది.

చలమయ్య అయిదు పది రూపాయలనోట్లు అందించాడు.

'దీనిమీద కూడా ఏమీ రాయలేదా నాయనా' ఇంకా ఏదో ఆశ.

'రేపెలాగూ వుత్తరం వ్రాస్తాడు కాబట్టి రాసుండడులేవ్వా' —

అనసూయమ్మ చలమయ్య కళ్లలోకి సూటిగా చూసింది. తన రాముడు కూడా చలమయ్య యీడువాడే. చదువుకునే రోజుల్లో యిద్దరూ మంచి స్నేహితులు కూడా. హైస్కూలు చదువుతోటే విరమించుకుని చలమయ్య పోస్టాఫీసులో వుద్యోగానికి చేరినపుడు తను 'అయ్యో' అనుకుంది. తన కొడుకు యింకా పైకి చదివి పెద్ద వుద్యోగంలో చేరినపుడు 'హమ్మయ్య' అనుకుంది.

కానీ — మనిషిగా ఈ చలమయ్య ముందు తన రాముడేపాటి ? సూర్యుడి ముందు దివిటీ !!

'నాయనా చలమయ్యా ! వాడు నన్ను రమ్మని వ్రాయడు నాయనా... వ్రాయడుగాక వ్రాయడు నాయనా...' గొంతు బొంగురు బోయింది దుఃఖంతో.

'తప్పక రాస్తాడవ్వా... రామారావు మనసు నాకు తెలుసు...'

'మళ్లీ ఈ నెల కూడా డబ్బు పంపించాడుగా... ఇక మరో నెలదాకా ఈ ముసలితల్లి వాడికి పొరపాటునైనా గుర్తుకు రాదు. వాన్ని కని పెంచిన ఋణం యిలా నెలనెలా నోట్ల కట్టల ద్వారా తీర్చుకుంటున్నా ననుకుంటున్నాడే కాని — ఈ పండువయసులో నా మనసేం కావాలని వాడికి అర్థంకాదు నాయనా... కాదు కాదు...'

ముడతలుపడ్డ ఆ చెక్కిళ్లనిండా కాల్వలుగా కన్నీరు.

'వాడి డబ్బుక్కూడా యిదే నాయనా ఆఖరు... ఈ నెలరోజులూ వాడి పిలుపు కోసం చూసి చూసి విసిగి విసిగి ఏడ్చి ఏడ్చి తప్పకుండా చచ్చిపోతాను. అప్పుడు వాడొచ్చి లోకం కోసం రాని కన్నీళ్లు తుడుచుకుంటాడు. . మనసులో ఈ ముసలిపీడ విరగడయిందనుకుంటాడు. కోడలుపిల్ల యాభై మిగిలిందుకు సంతోష పడుతుంది. నా బ్రతుకింతే నాయనా యింతే.. దయలేని కొడుకులగన్న అందరి తల్లుల కథ యింతే నాయనా, యింతే—'

అనసూయమ్మ దుఃఖాన్ని ఆపగల శక్తి చలమయ్యకు లేదు.

ఆమె ఆవేదననూ, ఆకాంక్షనూ అర్థం చేసుకోగల చలమయ్య మనసు మౌనంగా కన్నీళ్లు కార్చింది.

అనసూయమ్మ ముఖంలోకి సూటుగా చూస్తున్న చలమయ్య కళ్లు — ఆమె చెంపనుండి చెవిదాకా నల్లగా కట్టిన గాయం మచ్చను కన్నీళ్లతో గమనించాయి.

అవును. ఇప్పుడది కేవలం మచ్చే. కాని ఒకప్పుడది మండిన గాయం. ఆమె ముఖాన్ని మనసునూ మండించిన గాయం.

చలమయ్యకు యింకా బాగా గుర్తుంది ఆ ఆ సంఘటన. ఆ సంఘటనతో ఆ తల్లి మనసు పొందిన అవమానం కూడా యింకా గుర్తుంది.

పదవ తరగతి చదువుతున్న రామారావు చౌదరిగారమ్మాయికి ప్రేమలేఖ వ్రాశాడు ఆ అమ్మాయి ఆ లేఖను వాళ్ల నాన్నగారికిచ్చి ఏడ్చింది.

గ్రామంలో ఎదురులేని చౌదరి యింతెత్తున ఎగిరాడు చెలరేగిన కోపంతో మండు వేసవి మధ్యాహ్న మార్తాండుడయ్యాడు.

ఫలితం—! రామారావుని పెడరెక్కలు విరిచి వారి బంగళా స్తంభానికి కట్టి— కొరడా తీశాడు.

ఈ వార్తవిన్న తల్లి మనసులో వేయి పిడుగులు పడ్డాయి.

కన్నపేగు క్షేమం కోసం కలవరపడింది. చౌదరిగారింటికి పరుగుతీసింది ఆ బీద తల్లికి కావలసింది అభిమానం కాదు— కొడుకు క్షేమం. అందుకే చౌదరిగారి కాళ్లకు చుట్టుకుంది— తన కొడుకుని క్షమించమని.

చౌదరి మనసు కరుగలేదు సరికదా... కొరడా రివ్వున గాలిలోకి లేచింది తోక త్రొక్కిన త్రాచులా.

క్షణాల్లో చౌదరిగారికాళ్లు విడిచి కొడుకును చుట్టుకుంది ఆ తల్లి.

ఛెళ్... ఛెళ్... ఛెళ్...

కొరడా కసిగా కాటు వేసింది. ఆ తల్లి

### పింగాణీ దంతాలు !

కొత్త పింగాణీ దంతాన్ని జపానులోని ఆప్టికల్ కంపెనీవారు తయారు చేశారు. ఇది ఇతర కృత్రిమ దంతాల కంటే మరింత అనువుగా దవడ ఎముకలో సరి పోగలదని తేలింది. కాల్షియం ఫాస్ఫేటు ఎక్కువగా వుండే కృత్రిమ దంతాన్ని తయారుచేయాలని ప్రయోగాలను ప్రారంభించారు. కానీ చివరకు సహజమైన దంతం కంటే గట్టిగా ఉండే పింగాణీ దంతాన్ని రూపొందించారు. ప్రయోగశాలలో జరిపిన పరీక్షలలో ఇది 95 శాతం విజయాన్ని సాధించింది. దవడ ఎముక ఈ పన్నుకు మరింత ఆధారం కల్పిస్తుంది. దీనిని అమర్చటానికి ఉపయోగించే చిగురు పదార్థం గట్టిగా అతుక్కోవటం వలన బాక్టీరియా, వైరస్ వ్యాధులు కూడా ఏర్పడవు.

నీపు నుండి, ముఖం నుండి రివ్వున రక్తం చిమ్మింది.

కొడుకు క్షేమం కోసం కన్నతల్లి రక్త సమర్పణం !

ముఖంమీద పడిన గాయం కంటె ఆమె మనసుమీద పడిన గాయం మరింత పెద్దది. అందుకోసం ఆమె కొన్నాళ్లు కన్నతల్లి లాటి ఆ వూర్ని వదిలేసింది.

గాయపు మాని మచ్చను చూస్తున్న చలమయ్య మనసు గతాన్ని త్రవ్వింది.

హుం ...

ఇపుడు చెట్టంత పెరిగిన ఆ కొడుకు— కని పెంచిన తల్లికి చేరెడు నీడ నివ్వటానికిక్కూడా వెనుకాడుతున్నాడు.

ఛీ... ఛీ...

చలమయ్య కన్నీళ్లు తుడుచుకుని కదిలాడు.

కదిలిపోతున్న చలమయ్యను కన్నీళ్లతో చూస్తూనే వుంది అనసూయమ్మ.

ఎండ మండిపోతునే వుంది— కన్నమనసు తెలియని కన్నకొడుకు దౌష్ట్యంలా.

*  *  *

మరునాడు ...

మరునాడు ... ...

మ ... రు ... నా ... డు ...

కాలం బరువుగా ... బాధగా క్షణాలు యుగాలుగా మారి కదులుతూంది. ఎదురు తెన్నులు చూసి చూసి అలసిసొలసిన ఆ కన్నులు— బరువుగా, భారంగా కన్నీళ్లతోనే కన్నకొడుకు అక్షరాహ్వానం కోసం నిరీక్షిస్తూనే వున్నాయి ఓపిగ్గా.

ఆ కన్నతల్లి మూగమనసు బాధను కళ్లారా నిత్యం చూస్తున్న చలమయ్య మనసు కన్నీరు కారుస్తోంది జాలి జాలిగా.

నిర్దయగా ఆ ముసలి తల్లి గుండెకోత కోస్తున్న ఆ కన్నకొడుకుమీద రోజు రోజుకూ అసహ్యం పెరుగుతునే వుంది.

ఆ కన్నతల్లి ప్రేమానురాగాలను, రక్త మాంసాలను దోపిడీ చేసుకుని పెరిగి — తన జీవితాన్ని పెళ్లాం బిడ్డలకే పంచిపెట్టి — కన్న తల్లికి కన్నీళ్లే మిగిల్చిన ఆ కొడుకుమీద — చలమయ్య మనసు మండిపడుతూ వుంది.

గుండెదాకా చీలిన నేలతల్లి తొలకరి జల్లుల కోసం వేచినట్లుగా —

ఆకులన్నీ రాలి బోసిపోయిన చెట్టు వసంతం కోసం తపించినట్లుగా —

మండే ఎండలకు ఎండిన వంకా వాగు వానచినుకు కోసం తపించినట్లుగా.

ఆ తల్లి చూచి . . చూచి . . చూచి ... పూర్తిగా అలిసింది.

ఎదురుచూస్తున్న వుత్తరం రాలేదు —

కలలు కంటున్న కమ్మని పిలుపు రానేలేదు.

కన్న కడుపు మనసు కరుగనేలేదు.

అనసూయమ్మ మనసు గాయపడింది. ఏ మందులకూ, మాకులకూ లొంగని విధంగా గాయపడింది.

ఎదురుచూచిన కళ్లముందు కటిక చీకటి. ఏ వెలుగురేఖలకు విచ్చని దట్టమైన కారుచీకటి.

ఓడిన మనసూ, వాడిన వయసూ అనసూయమ్మను ఒక్కసారిగా మంచ మెక్కించాయి.

జ్వరం ... జ్వరం ...

మూసిన కన్ను తెరవని జ్వరం ...

జ్వరంలో కలవరింతలు ... ఆ జ్వరంలోనే కొడుకు పిలుపు కోసం ఎదురుతెన్నులు ..

మరునాడు మధ్యాహ్నం .

పోస్ట్‌మాన్ చలమయ్య మండే ఆ మనసును చల్లార్చగలిగేవుత్తరం లేకుండానే—వట్టి చేతులతో —మధనపడే మనసుతో ఆ పెంకుటింటి ముందు ఆగాడు. పెంకుటింటి అరుగుమీద అనసూయమ్మ కూర్చునే స్థలం బోసిగా — ఏ ప్రేమకూ నోచని మనిషి మనసులా వుంది.

చలమయ్య మనసు వేగిరపడింది.

ఇంట్లో కుక్కిమంచంలో జ్వరంతో మూలుగుతూ—తన ఊసే పట్టించుకోని కొడుకు కోసం తహ తహ లాడిపోతూ కలవరిస్తున్న ఆ ముసలి తల్లిని చూసి కన్నీళ్లతో కరిగి పొయ్యాడు.

అనుకోకుండా చలమయ్య మనసులో గత కాలపు జ్ఞాపకాలు కదిలాయి. రామారావనే ఓ కరకు గుండెల కసాయిని నవమాసాలు మోసి, జన్మనిచ్చి, అష్టకష్టాలూ, అవమానాలూ పడి పెంచిన తల్లేకాదు ఆమె—

ఆ కసాయికి కేవలం ఒక్క జన్మేకాదు — పునర్జన్మ కూడా ప్రసాదించిన మహాతల్లి ఆ కన్నతల్లి.

అవును —

రాముడు కాలేజీలో చదువుతుండగా ఓసారి శెలవులకు యింటికొచ్చాడు తనూ, తన తల్లి స్థితి, తన తాహతూ మరిచి కామందులగారబ్బాయితో తగవు పెంచుకున్నాడు.

పొగరెక్కిన పొట్టేలుగా కొండను ఢీకొన్నాడు. ఫలితం—? తల పగిలింది.

ఆ దృశ్యం అనసూయమ్మ గుండెల్ని పిండి చేసింది

రక్తపు మడుగులో గిలగిల కొట్టుకుంటున్న కొడుకు—

కడుపు చించుకొని పుట్టిన కన్నకొడుకు క్షణక్షణానికీ మృత్యువువైపు కదులుతున్నాడు.

అనసూయమ్మ గుండెలు పగిలేలా ఏడ్చింది

చూపరుల గుండెలు [illegible] ...ంగలా ఏడ్చింది.

...క్కలు ముక్కలుచేసుకున్నా సరిగా కడుపే నిండని పరిస్థితి ఆమెది.

మృత్యుముఖంలోని కొడుక్కు క్షణాల్లో వైద్యం జరగాలి...జ. .ర. .గా...లి. కానీ — ఎలా ? ఎలా ? ? ఎలా ? ? ?

అప్పటికి సంవత్సరం క్రిందే పోస్ట్‌మాన్‌గా చేరిన చలమయ్య ముందు కొచ్చాడు — పగిలే ఆ గుండెను సముదాయించటానికి.

దయగల మనసులు తలా ఒక చెయ్యి అందించాయి.

రామారావును పట్నంలోని ఆస్పత్రిలో చేర్పించారు.

సాయంకాలానిక్కూడా పరిస్థితి మెరుగు పడలేదు. రామారావింకా చావుబతుకుల్లోనే వున్నాడు.

కన్నతల్లి ఏడ్చి ఏడ్చి — యిక ఏడ్వలేక సొమ్మసిల్లి దీనంగా శూన్యంలోకి పిచ్చిదానిలా చూస్తూవుంది. కొడుకు క్షేమం కోసం కనిపించని దేవుళ్లకు మొక్కుకుంటునేవుంది.





భారత దేశంలో ప్రఖ్యాతి గాంచిన

డయొనారా టివిక

మేము అధీకృత డీలర్లము

మెస్సర్స్. ముట్టుపల్లి లక్ష్మయ్య సన్స్,
క్లాత్ బజార్, గుంటూరు- 3 ఫోన్ 20371

అమ్మిన తర్వాత కంపెనీ ఇంజనీర్లచే
సర్వీసు మా ప్రత్యేకత

TARA-2/122

అపుడు డాక్టరన్నాడు – రామారావు బ్రతకటానికి రక్తం కావాలని – ఆ గ్రూపు రక్తం ఆస్పత్రిలో లేదనీ...

'ఆఁ !!!'

అనసూయమ్మ గుండెలు గుభేలుమన్నాయి.

కానీ – అంతలోనే ఆ తల్లి మనసులో ఏదో ఆనందరేఖ...

'బాబూ .. డాక్టరు బాబూ... నేను వాని కన్నతల్లిని.. వాడు నా రక్తం పంచుక పుట్టినవాడు.. నా రక్తం పరీక్షించండి... తప్పక సరిపోగలదు...'

ఏడుస్తూనే డాక్టర్లను వేడుకొంది. పరీక్షలు జరిగాయి.

తల్లిగా అనసూయమ్మ జన్మ సార్థకమయ్యింది.

తన రక్తాన్ని పంచియిచ్చి కొడుకుకు పునర్జన్మ ప్రసాదించింది.

అపుడు —

ఆ తల్లి మనసుకు ప్రపంచాన్ని జయించినంత సంతృప్తి.

ఏ తల్లి హృదయమూ అధిరోహించని శిఖరాన్నెక్కినంత ఆనందము —

కానీ —

ఇపుడదే తల్లి మనసు ప్రపంచంలోని సౌభాగ్యాన్నంతా పోగొట్టుకున్నంత దుఃఖమగ్నంగా వుంది.

అంతులేని అగాధాల్లో కూలిపోయినంత దీనంగా, దయనీయంగా వుంది.

కళ్లు తుడుచుకుని చలమయ్య బయటికి నడిచాడు. వాకిట్లోనే ఎదురయ్యింది కుంటికుక్క దీనంగా చలమయ్య కళ్లలోకి చూస్తూ —

చలమయ్య మనసును కలచాయా కుక్క చూపులు.

కేవలం ఎంగిలిమెతుకులు తిన్న కుక్క తన యజమానురాలికోసం అంతగా దిగులుపడిందే—?!

మరి... మరి... మమతలు పంచుకుని... బ్రతుకును పెంచుకున్న ఆ కన్నకొడుకు...?!

ఆపైన ఆలోచించలేక గబగబా నడిచి వీధి మలుపు తిరిగాడు చలమయ్య.

* * *

రెండు రోజుల తర్వాత—

ఉత్తరాలు సార్టింగ్ చేస్తున్నపుడు చలమయ్య కళ్లు ఆశ్చర్యంతో మెరిశాయి. మనసు ఆనందంతో పరవశించింది......కార్డు ముక్క...

అనసూయమ్మ ఎదురు చూస్తున్న వుత్తరం వచ్చింది. ఎక్కడో దూరాన వున్న కొడుకు మనసును అక్షరాలుగా మోసుకొచ్చింది ఆ వుత్తరం.

ఎలానూ ఆ వుత్తరం అనసూయమ్మకు తనే చదివి వినిపించాలి కాబట్టి ఆ కార్డుముక్క సంకోచం లేకుండా చదివాడు చలమయ్య.

అంతే!!!

# గుండె గుండెకో ఒక దీపం

వందల వేల వోల్టుల షాక్ తిన్నట్లుగా నిలబడిపొయ్యాడు.

తన వునికినే మరిచి స్థాణువుగా మిగిలిపొయ్యాడు.

అమృత జల్లుల కోసం ఎదురు చూస్తున్న ఆ ముసలి తల్లి మనసు మీద విషపు జడివానలు కురిపించే వుత్తరమది.

ప్రేమ పిలుపు కోసం నిరీక్షించే ఆ కన్నతల్లి గుండెలో హాలాహలం చిలికించే వుత్తరమది.

అనసూయమ్మ చిరకాల కోర్కెను నిర్దాక్షిణ్యంగా తిరస్కరించాడు ఆ కొడుకు. ముసలి తల్లిని తనతో తీసుకు వెళ్లటానికి వీలుకాదు— ససేమిరా వీల్లేదన్నాడు కూడా. పైగా మాటి మాటికి వెధవ వుత్తరాలు వ్రాయించి ఆఫీసులో తన పరువు తీస్తోందన్న తీవ్ర హెచ్చరిక కూడా చేశాడు. నెల నెలా తను పంపే యాభై రూపాయలు చాలకపోతే మరో అయిదో పదో పంపుతానన్నాడు—నోరు మూసుకుని, మరింక వుత్తరాలు వ్రాయకుండా అక్కడే పడివుండమని కోపంగా రాశాడు అందులో......

ఆ కుళ్లు అక్షరాల వెనుకనున్న విషగాలుల్నుండి తెప్పరిల్లటానికి...మనసున్న ఆ మనిషికి పది నిమిషాలు పట్టింది.

చలమయ్య కోపంతో పళ్లు పటపట కొరికాడు.

ఆ నరరూప రాక్షసుని పీక నులిమి చంపినా పాపం లేదనిపించింది అతనికి. ఆవేశం తగ్గింతర్వాత ప్రస్తుత కర్తవ్యాన్ని గురించి నింపాదిగా ఆలోచించాడు. ఒకవేళ ఈ వుత్తరం ఆమె వింటే గుండె పగిలి మరణిస్తుంది... తప్పక దారుణమైన హృదయ బాధతో మరణిస్తుంది.

బాధ్యత గల ఒక వుద్యోగిగా ఆ వుత్తరం ఆమెకందించటం తన విధి.

మనసున్న ఓ మనిషిగా ఓ ప్రాణం కాపాడటం తన కర్తవ్యం.

చలమయ్య మనసు నిండా ఎడతెరిపిలేని ఆలోచనలు...

ఎదురైన సమస్యకు సబబైన పరిష్కారం కోసం ఆరాటం...

చాలసేపటికిగాని చలమయ్య ఆలోచనలు ఓ కొలిక్కి రాలేదు. మనసునిండా దట్టంగా ముసురుకున్న సమస్యల చీకట్లో పరిష్కార వెలుగురేఖ అవును... పరిష్కారం దొరికింది.

ఓ ఖాళీ కార్డుమీద గబగబా నాలుగు వాక్యాలు వ్రాశాడు. దానిమీద తనే అనసూయమ్మ అడ్రసు వ్రాశాడు. తనే పోస్టలు ముద్ర గుద్దాడు.

తర్వాత— తను పంచవలసిన ఉత్తరాలు బొత్తిలోకి తను వ్రాసిన కార్డు కూడా యెక్కింది.

అసలైన కార్డు పదిలంగా జేబులో పెట్టుకున్నాడు.

అనసూయమ్మగారి వీధి మలుపు తిరిగాడు చలమయ్య. కుంటికుక్క భౌ భౌ మంటూ స్వాగతం పలికింది. జ్వరం కొంచెం నెమ్మదించిన అనసూయమ్మ మనసు చలమయ్య అడుగుల సవ్వడి కోసం వేగిరపడుతోంది.

'అవ్వా! ఇదిగో నీకుత్తరమొచ్చేసింది నీ కొడుకు వ్రాశాడు... నే చెప్పలా నాలుగు రోజులు ఆలస్యమయినా తప్పక వ్రాస్తాడని... ఎంతయినా రాముడు నీ కొడుకే కదా... ఊరికే నువ్వు వేగిరపడి... ఆలోచనలతో జ్వరం తెచ్చుకున్నావ్—' చలమయ్య గొంతులో హుషారు. గుండెలో బాధ.

'ఆఁ!!... వుత్తరమొచ్చిందా నాయనా...

నాలుగు క్షణాల కిందటిదాకా కదలలేనిది.. ఇపుడు హుషారుగా లేచి కూర్చుంది. ఆ ముసలి తల్లి శరీరాన్ని నడిపించేది తిండికాదు! మరి? కన్న ప్రేమ!! చలమయ్య ఆనందంగా, హుషారుగా చదివాడు.

''త్వరలోనే వస్తున్నాను – వచ్చి నిన్ను తీసుకెడతాను—అమ్మా! నీ ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకో— డాక్టర్లకు చూపించి మందులవీ వాడు...''

ఎండిన మనసు ఆనందపు జల్లులతో తడిసింది.

గుంటలు పడ్డ చెక్కిళ్లలో విజయరేఖ మెరిసింది.

చీకటి నిండిన కళ్లల్లో వెలుగు వెల్లువ పొంగింది.

ఆ తల్లి మనసు పురివిప్పిన నెమలిలా ఆడింది. తన అదృష్టానికి పొంగిపొంగి పోయింది.

'నా రాముడి మనసు నాకు... నాకు తెలుసు నాయనా! తెలు...సు. ఈ కన్నతల్లిని... ఈ ముసలితల్లిని... మరిచిపొయ్యేటంత నీచుడు కాదు నాయనా... కాదు.. ఓ వారం రోజుల్లో వచ్చేస్తానన్నాడుగా.. పాపం వాడి కెన్నిపనులో .. క్షణం తీరికుండదు... అయినా వచ్చేస్తాడులే...'

ఆనందంతో తనలో తానే మాట్లాడుతున్న ఆ తల్లిని పిచ్చివాడిలా గుడ్లప్పగించి చూశాడు పోస్ట్‌మాన్ చలమయ్య.

ఆ దృశ్యం చూసి కళ్లనిండా తిరిగిన కన్నీళ్లు చెక్కిళ్లమీదుగా జారాయి.

కార్డు ఆమె చేతిలోపెట్టి – బరువెక్కిన గుండెలతో గబగబా బయటికి నడిచాడు చలమయ్య.

ఆ కార్డులోని అక్షరాలను నిమురుతూ - కన్నకొడుకు వీపు నిమిరినంతగా ఆనంద పరవశత చెందుతోంది ఆ బీదతల్లి వెర్రిమనసు.

ఆ సాయంకాలం –

బస్సుకు పంపటానికి పోస్ట్ బ్యాగ్ సిద్ధం చేస్తున్నవేళ – పిడుగులాటి వార్త క్షణాల్లో ఊరంతా వ్యాపించింది.



# డాక్టర్ సలహాలు

డాక్టర్ కె. వెంకటేశ్వరరావు

### ఎం. బి. కె. – విజయవాడ

నాకు ఇస్నోఫీలియా 36 శాతం ఉన్నది. దానిని పూర్తిగా నివారించుటకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాడవలసిన మందులు తెలియ జేయండి ?

★ ఇయోసినో ఫిల్సు అనేవి రక్తంలోని తెల్లకణాలలోని ఒకరకం. మామూలుగా 6నుంచి 8 దాకా ఉండవచ్చును. రక్తంలోని వీటిసంఖ్య అలర్జీవల్ల పెరుగుతుంది. ఎందువల్ల అలర్జీ ఏర్పడిందనే విషయాన్ని పరీక్షించటం అవసరం. మలపరీక్ష, ఛాతి ఎక్స్‌రే మొదలయిన పరీక్షలు అవసరం అవుతాయి.

హెట్రజాన్ మాత్రలుగాని, యూనీ కార్బసాన్ మాత్రలుగాని వైద్యుల సలహాప్రకారం వాడవలసి ఉంటుంది. మూలకారణం అయిన అలర్జీకిగాను యాంటీ హిస్టమినిక్ మందులైన పిరిటాన్, అవిల్ మొదలయినవాడటం, కడుపులోని క్రిములకిగాను తగినమందులు (పైపరజీన్ సిట్రేట్) వాడటం అవసరం.

### బి. ఎవ్. కె. – హైదరాబాద్

నా వయస్సు 18 సం॥లు. నేను ప్రతి రోజూ ఉదయం రాత్రి కాల్‌గేట్ టూత్ పేస్టుతో పండ్లు తోముతాను. అయినా నా స్నేహితులు నన్నుచూసి నా దగ్గర భరించరాని దుర్వాసన వస్తున్నదనీ, నేను మాట్లాడుతూ ఉంటే అది మరీ ఎక్కువగా ఉంటుందనీ అంటారు. నావద్దకి ఎవరూ చేరరు. అవసరం కొద్దీ దగ్గరకివచ్చి మాట్లాడినా వీలయినంత త్వరగా తొలగిపోతారు. టాన్సిల్స్, అడినాయిడ్స్ వంటివి ఏవీ పెరగలేదన్నారు.

★ నోటిద్వారా దుర్వాసన రావటానికి దంతరోగాలు, చిగుళ్ళవాపు, టాన్సిల్స్ వాచి ఉండటం, ఊపిరితిత్తులలో చీమువంటి పదార్థం చేరటం, బ్రాంకియెక్టేసిస్, అజీర్ణం మొదలయినవి కారణాలవుతాయి.

మీరు వీటికీగాను వైద్యులవద్ద పరీక్ష చేయించుకోవటం అవసరం.

### ఎవ్. ఆర్. – తుంగభద్రాడాం

బుల్‌వర్కర్‌ను వుపయోగిస్తే కేన్సర్ వస్తుందని విన్నాను. నిజమేనా ? సుఖవ్యాధులు ఒకసారి వస్తే ఎవరూ వాటిని నిర్మూలించలేరని ఎక్కడో చదివాను ఇది ఎంతవరకు నిజం ?

★ బుల్ వర్కర్‌కీ కేన్సర్‌కీ ఏమీ సంబంధము లేదు.

అన్ని రకాల సుఖరోగాలకీ ప్రస్తుతం మందులు ఉన్నాయి. ఆ మందులని ఎవరూ క్రమబద్ధంగా శాస్త్రీయంగా వాడటంలేదు. కొంతవరకు, తక్కువ మోతాదులో మందులను వాడటంవల్ల ఏ విధమైన ప్రయోజనమూ లేకపోగా ఆ మందులు ఆ రోగానికి పనిచెయ్యలేని పరిస్థితి (బాక్టీరియాలు మందులకి లొంగని స్థితి – రెసిస్టెన్స్) ఏర్పడే అవకాశం ఉంటుంది.

### ఎ. ఎస్. ఆర్. – నరసారావుపేట

నా వయస్సు 19 సం.లు. నాకు 5 సం.ల నుండి చెవులో చీము కారుతున్నది. ఎంతో మందికి చూపించాను. మందులు ఇచ్చారు కాని ఫలితం కనబడలేదు. ఈ మధ్యనే కొద్దిగా వినబడుట లేదు.

★ చెవులలో నుంచి కారే చీముని లేబరేటరీలలో కల్చర్ చేసి, సెన్సిటివిటీ టెస్టు మూలంగా ఏ మందులకి ఆ క్రిములు లొంగుతాయో కనుకొని ఆ మందుని చెవులలోను, ఇంజక్షను లేక మాత్రల మూలంగా గాని వాడవలసి ఉంటుంది.

అరుదుగా చెవి భాగంలో చిన్న శస్త్రచికిత్స చేయవలసి రావచ్చును. ★

---

అనసూయమ్మ మరణించింది !!

'ఆఁ !!!' —

చేతిలో పని క్షణాల్లో పూర్తిచేసి పరుగుల మీద వెళ్ళాడు చలమయ్య ఆ పెంకుటింటికి.

పెంకుటింటి ముందు జనం మూగారు.

కుక్కి మంచంలో నిర్జీవంగా ఆ ముసలి తల్లి.

కుంటికుక్క ఆకాశంకేసి చూసి 'గో'మని దీనంగా ఏడుస్తోంది.

మధ్యాహ్నపు దృశ్యం చలమయ్య కనుల ముందు మెదిలింది.

చలమయ్య కళ్ళు శ్రావణ మేఘాల్లాగా వర్షిస్తున్నాయి.

తను ఏది జరగకూడదని ఊహించుకుని — ఆలోచించి ఆలోచించి వుపాయం ఆలోచించాడో — అక్షరాలా అదే జరిగింది.

జనం అనసూయమ్మ మంచితనం గురించి— ఆమె పడిన కష్టనిష్ఠూరాల గురించి—దీనంగా కన్నీళ్లతో చెప్పుకుంటున్నారు.

అదే జనం కరకుగుండెల కసాయి కొడుకు గురించి హేయంగా తిట్టుకుంటున్నారు. ఆమె చనిపోయినా —

ఆమె కళ్ళు యింకా దేనికోసమో నిరీక్షిస్తున్నాయి.

ఆ నిరీక్షణ ఎవరికోసమో చలమయ్యకు తెలుసు.

కన్నీళ్ళు తుడుముకుని 'ఆ కన్నకొడుకు'కు టెలిగ్రాం యివ్వటానికి చలమయ్య కదిలాడు.

వాకిట్లో కన్నీళ్లతో దీనంగా కుంటికుక్క.

* * *

అన్నీ తెలిసిన చలమయ్యకు తెలియంది ఒక్కటే. అదే ఆమె చావు రహస్యం.

తను చొక్కా జేబులో మరచిన ఆవలు వుత్తరం — తన పదేళ్ల కొడుకు — అడ్రసు ప్రకారము అనసూయమ్మకు అందించాడనీ తెలియదు —

కేవలం అందించటమే కాకుండా చక్కగా చదివిపెట్టాడనికూడా తెలియదు.

అంతే !!

కొడగట్టిపోతున్న గుండె దీపం బాధతో, భయంతో, అవమానంతో, దుఃఖంతో రెపరెపలాడిపోయింది.

సుడిగాలిలో చిరుదివ్వెలా వణికిపోయింది.

రక్తమాంసాలు పంచుకపుట్టిన కసాయి కొడుకును శపించిన ఆ గుండె అడుగు పొరల్లో — చలమయ్య తియ్యని మనస్సుకు చల్లని ఆశీస్సు లభించింది.

కొడుకు వుత్తరాన్ని కసిగా ముక్కలుగా చించింది ఉద్వేగంతో.

చలమయ్య వుత్తరాన్ని తృప్తిగా నిమిరింది కన్నీళ్లతో.

అంతే — రెపరెపలాడుతున్న దీపం భగ్గున ఆరిపోయింది.

... ఓ బీదతల్లి గుండెలో కొడగట్టిన దీపాన్ని వెలిగించటానికి ఓ మనసున్న మనిషిగా చలమయ్య చేసిన ప్రయత్నాన్ని — విధి వ్యతిరేకించింది.

దీపం ఆరిపోయింది. ★